సంపుటి : 9
సంచిక : 296
ఆదివారం
19 జులై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వ వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999



# కాలుష్య రహిత రాష్ట్రంగా ఏపీ

- మీ ఊరిని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మీదే
- ప్రజా ప్రభుత్వానికి పేదల పక్షాన ఆలోచించే మనసు ఉంది
- 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు
- బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగారు
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులు సహించేది లేదు
- గుడివాడ స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.15,274 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం

**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రతో పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయుడు అన్నారు. ఇంటి నుంచే చెత్త రాకుండా నెట్ జీరో విధానాన్ని అలవాటు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. కార్బన్ న్యూట్రల్ జీవన విధానం అవలంబించాలని, ఇంటిపై పడే వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకునే చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణాజిల్లా గుడివాడలో నిర్వహించిన 18వ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ప్రజా వేదిక సమీపంలో ఆన్‌లైన్ వర్క్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు. మెప్మా మహిళా సంఘాలు తయారు చేసి ప్రదర్శించిన ఉత్పత్తులను తిలకించారు. నెల్లూరు, కొండపల్లి, బేతంచర్ల, కమలాపురం, బద్వేల్, ఏలేశ్వరం, నర్సీపట్నం, పెద్దాపురంలో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఉయ్యూరు, కుప్పం, నిడుదవోలు, బాపిరాజు, మదనపల్లి, విజయనగరం, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్, గ్రేటర్ విశాఖ, నెల్లూరు కార్పొరేషన్లకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ అవార్డులు అందించిన సీఎం...ఆపరేషన్ క్లీన్ స్వీప్‌పై కాఫీ టేబుల్ బుక్‌ను ఆవిష్కరించారు.

**స్వచ్ఛ రాజకీయ లక్ష్యంతో ఎన్టీఆర్ పార్టీ స్థాపన**

రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నానని, ఈసారి 18వ కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడివాడ దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజా క్షేత్రంలో నిలబడిన ప్రాంతమని గుర్తు చేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు,

మిగతా .. 2లో..

ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా

## భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

సీఎం చంద్రబాబు

ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ

మిగతా .. 2లో..

పవన్ కళ్యాణ్‌ని

## పరామర్శించిన నారా లోకేష్




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి శనివారం సాయంత్రం వెళ్లిన లోకేష్ విజయవాడ కనకదుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భుజానికి అయిన గాయం, శస్త్ర చికిత్స గురించి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలని కోరారు.

నేనున్నంత వరకు

## బీఆర్ఎస్ సర్కారు రానివ్వను

తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



**ఘట్‌కేసర్, విశ్వం వాయిస్ న్యూస్ :** దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట

మిగతా .. 2లో..

కీలక నేతల మధ్య విభేదాలపై

## భాజపా అధిష్ఠానం దృష్టి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ భాజపాలో కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు

మిగతా .. 2లో..

## 'మిషన్ ఆగమన్' ప్రయోగం విజయవంతం

స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ 'విక్రమ్-1'

షార్‌లో ప్రయోగ కార్యక్రమాన్ని కుమారుడు దేవాన్ష్ తో కలిసి వీక్షించిన మంత్రి నారా లోకేష్

**శ్రీహరికోట, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మిషన్ ఆగమన్' ద్వారా భారత అంతరిక్ష రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రైవేటు సంస్థ అయిన ప్రముఖ స్పేస్ టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1'ను శనివారం ఉదయం 11.30 గం.లకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలోని(షార్) ఒకటో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపారు. మిషన్ ఆగమన్ పేరిట చేపట్టిన తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగ కార్యక్రమాన్ని షార్ లోని ఇస్రో లాంచ్ వ్యూ గ్యాలరీ నుంచి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్‌తో కలిసి వీక్షించారు.

**దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్-1'**

దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్‌గా ఆర్బిటాల్ విక్రమ్-1ను అభి




వృద్ధి చేశారు. స్కైరూట్ అభివృద్ధి చేసిన ప్రొపల్షన్ సిస్టమ్స్, త్రీడీ ప్రింటెడ్ ఇంజన్లు, ఘన ఇంధన రాకెట్ బూస్టర్లు అమర్చారు. సుమారు 350 కిలోల బరువున్న నాలుగు చిన్న ఉపగ్రహాలను 450 కి.మీల ఎత్తులోని భూ నిమ్న కక్ష్యలోకి

మిగతా .. 2లో..

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే

## కూటమి ప్రభుత్వ లక్ష్యం

- భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరాన్ని అందించవలసిన బాధ్యత మనందరిపై ఉంది
- పరిసరాలు పరిశుభ్రతలో ప్రతి ఒక్కరికి దినచర్యల్లో ఒక భాగం కావాలి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీపురుని చేతబట్టి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రం చేసిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/ ఆగిరిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రతి మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా "బల్క్ వేస్ట్ జనరేటర్స్ నమోదు, ఘనవ్యర్థాలు నిర్వహణ నియమాలు మరియు పరిశుభ్రత పట్ల అవగాహన" అనే థీమ్‌తో కార్యక్రమాన్ని రాష్ట్ర గృహనిర్మాణ,

మిగతా .. 2లో..

యూట్యూబర్ రావణ్ రిమాండ్

## పొడిగించిన న్యాయస్థానం

**విశ్వం వాయిస్ న్యూస్ :** వివాదాస్పద సోషల్ మీడియా పోస్టులు, దేశద్రోహం కేసులో అరెస్ట్ అయిన ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్ జ్యుడీషియల్ రిమాండ్‌ను గన్నవరం న్యాయస్థానం మరో 14 రోజుల పాటు పొడిగించింది. ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న జోసెఫ్ గడువు ముగియడంతో, జైలు అధికారులు అతడిని వర్చువల్ విధానంలో న్యాయమూర్తి ఎదుట

మిగతా .. 2లో..

మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన

## మానవత్వానికే మచ్చ

గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు

మిగతా .. 2లో..

హెచ్-1బీ వీసా.. ఈ ఏడాదికి

## రెండో లాటరీ లేనట్లే




**విశ్వం వాయిస్ న్యూస్ :** హెచ్-1బీ వీసాలకు సంబంధించి అమెరికా పౌరసత్వం, వలస సేవల విభాగం కీలక అప్‌డేట్ ఇచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన 85వేల వీసా స్లాట్లకు తగినన్ని పిటిషన్లు వచ్చాయని ప్రకటించింది. లాటరీలో

మిగతా .. 2లో..

ఆంధ్రప్రదేశ్‌లో గోల్ఫ్ టూరిజం అభివృద్ధిపై

## కపిల్ దేవ్‌తో మంత్రి కందుల చర్చలు



**న్యూఢిల్లీ/అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధి, తద్వారా పర్యాటక రంగాన్ని బలోపేతం చేసే అంశాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నోయిడా (ఢిల్లీ)లో సుప్రసిద్ధ క్రికెట్ మరియు గోల్ఫ్ క్రీడాకారుడు, పీజీటీఐఅధ్యక్షుడు కపిల్ దేవ్ తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం విస్తరణకు ఉన్న అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అమరావతి ప్రాంతాలలో గోల్ఫ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను మంత్రి దుర్గేష్ .. కపిల్ దేవ్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాల్సిందిగా కపిల్ దేవ్‌ను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.




## మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ సతీమణి చెన్నమ్మ కన్నుమూత

తీవ్ర విచారం వ్యక్తం చేసిన చంద్రబాబు, లోకేష్



**విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన అర్ధాంగి చెన్నమ్మ శనివారం కన్నుమూశారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి చెన్నమ్మ మాతృమూర్తి. ఆమె మృతివార్త తెలియగానే పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ విచారాన్ని వ్యక్తం చేశారు. "చెన్నమ్మ కన్నుమూశారని తెలిసి తీవ్ర విచారం కలిగింది. మాజీ ప్రధాని దేవెగౌడకి, కేంద్ర మంత్రి కుమారస్వామికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, ఈ తీవ్ర దుఃఖ సమయంలో ఆ కుటుంబానికి ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు

మిగతా .. 2లో..

హర్మ్యూజ్‌లో ట్యాంకర్ల పేలుడు వార్తలు..

## స్పందించిన అమెరికా



**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మ్యూజ్‌లో సీమైన్లను ఢీకొట్టి రెండు చమురు ట్యాంకర్లు పేలినట్లు ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా ఖండించింది. ఎప్పటిలాగే ఐఆర్‌జీసీ అసత్య ప్రచారం చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. హర్మ్యూజ్‌లో రాకపోకలను అమెరికా, ఇరాన్ నియంత్రిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన నౌకలపై దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికా నిఘా సమాచారంపై ఆధారపడి వెళ్లిన రెండు నౌకలు సీమైన్స్‌ను

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# కాలుష్య రహిత రాష్ట్రంగా ఏపీ

స్వాభిమానం అనే లక్ష్యాలతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని చెప్పారు. గతంలో స్వార్థ రాజకీయాలే ఉన్న పరిస్థితిని మార్చి అభివృద్ధి, సంక్షేమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టే లక్ష్యంగా పాలన అందిస్తోందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా శాంతిభద్రతలు, సంక్షేమం, ఆదాయ వృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

**పరిశుభ్రమంటే ప్రజారోగ్యం మెరుగుపడటం**

'పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం మాత్రమే కాదని, పర్యావరణం, ప్రజారోగ్యం మెరుగు పడటమే అసలు లక్ష్యం. గత పాలనలో చెత్తతో నిండిపోయిన ప్రాంతాలను ఇప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి ఒక్కరూ తమ జన్మస్థలాన్ని చెత్త రహితంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిస్తున్నా. ప్రభుత్వానికి ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత లక్ష్యం సాధ్యం. పచ్చదనం, పరిశుభ్రతతోనే స్వర్ణాంధ్ర నిర్మాణం పూర్తి అవుతంది. తెలుగు జాతి భవిష్యత్తును రక్షించే బాధ్యత తాను తీసుకున్నానని, పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని సహించబోం. ప్రజా రాజధాని అమరావతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. గతంలో జన్మభూమి కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు స్పందించిన స్ఫూర్తి కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి ద్వారా సురక్షితమైన తాగునీరు, మెరుగైన పారిశుధ్య వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం అన్నారు.

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దతాం**

ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి కోసం రాష్ట్రంలో 8 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి ఇంట్లో వ్యర్థాల వర్గీకరణ ప్రారంభించాలని ప్రజలను కోరిన సీఎం, స్వచ్ఛ రథం ద్వారా వ్యర్థాల సేకరణ చేస్తూ రూ.16 కోట్ల విలువైన నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. గత పాలకులు రోడ్లపై పేరుకుపోయేలా వదిలేసిన చెత్త కారణంగా భూగర్భజలాలు కలుషితమయ్యాయని, వారు వదిలేసిన 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని చెప్పారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు.

**పట్టి సీమను అడ్డుకునేందుకు ప్రయత్నించారు**

'12 ఏళ్ల క్రితం కృష్ణా డెల్టాకు నీటి ప్రవాహాలు తగ్గిపోవడంతో దేశానికి అన్నపూర్ణగా పేరొందిన ఈ ప్రాంతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అందుకే 12 నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించాం. ఈసారి 48 శాతం వర్షపాతం లోటు ఉన్నప్పటికీ, ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి నీరు రాకున్నా పట్టిసీమ ద్వారా డెల్టాకు నీరు అందిస్తున్నాం. ఇప్పటివరకు 450 టీఎంసీల నీటిని తరలించి దాదాపు రూ.50 వేల కోట్ల సంపదను సృష్టించాము. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు చాలామంది ప్రయత్నించినా వెనక్కి తగ్గలేదు. పోలవరం పూర్తయిన తర్వాత గ్రావిటీ ద్వారా డెల్టాకు నీరు అందిస్తాం. వంశధార నుంచి పెన్నా వరకు నదుల అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**అక్వా, వ్యవసాయ రంగాలకు పూర్తి మద్దతు**

నీరు లేకుంటే అక్వా పరిశ్రమ ఉండదని, ప్రస్తుతం రొయ్యల ధరలు, మేత ధరల పెరుగుదల వంటి సమస్యలపై ఇప్పటికే కేంద్రంతో చర్చించామని సీఎం అన్నారు. ఈ ప్రాంత అక్వా పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడతామని, రూ.1.50 యూనిట్ చొప్పున విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణతోనే దిగుబడి, నాణ్యత పెరుగుతుందని, ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార పదార్థాల నాణ్యత పరీక్షలు కఠినమవుతున్న నేపథ్యంలో ప్రకృతి సేద్యంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. పీఎం కిసాన్ కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.20 వేల వరకు జమ అవుతున్నాయని, పొగాకు రైతులను కూడా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

**ఈ నెల 22 నుంచి తల్లికి వందనం**

ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 తేదీల మధ్య "తల్లికి వందనం" పథకం కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని చెప్పారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా పేదల పక్షాన నిలిచే మనసుంది అని ఆయన అన్నారు. అంగన్వాడీ సిబ్బంది, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పనిచేసే వారికి కూడా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. తల్లికి వందనం కింద 67,47,197 మంది విద్యార్థులకు సంబంధించి రూ.10,122 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

**తప్పు ఎవరు చేసినా వదిలిపెట్టం**

గత పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేదని సీఎం విమర్శించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు రాజకీయ చెత్తను శుభ్రం చేశారని, బూతులు తిట్టిన వారి నోళ్లను ఓట్లతో కడిగేశారని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు కొనసాగుతున్నాయని, కుట్రలు, కుతంత్రాలు, సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై చేసిన పోస్టులను ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సమర్థించుకోవడం సరికాదన్నారు. ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శ్రీకాకుళంలో గొర్రెల కాపరిని బైక్‌తో ఢీకొట్టి చంపిన ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకోకుండా సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. గుంటూరులో ఇద్దరి మధ్య జరిగిన తగాదాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఒక మహిళ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించిన ఘటనపై వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి, అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులను కూడా బదిలీ చేసినట్టు తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకునేందుకు వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా ప్రభుత్వం ఒకే విధంగా వ్యవహరిస్తుందని, తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

**అమరావతి, గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి విరాళాలు**

ఈ సమావేశంలో గుడివాడ స్థానికులు రాజధాని అమరావతితో పాటు.. గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. గుడివాడ బస్ స్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ. 3 కోట్లను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు చెక్కును సీఎం చంద్రబాబుకు అందించారు. అలాగే సాయి శ్వేత అనే గృహిణి అమరావతి అభివృద్ధికి తన చేతికున్న బంగారు గాజులను విరాళంగా ప్రకటించి సీఎంకు అందించారు. ఆమె తనయుడు గణేష్ తాను దాచుకున్న కిడ్డి బ్యాంక్ డబ్బులను సీఎంకు అందించారు. అమరావతి, గుడివాడ అభివృద్ధికి విరాళాలు ఇచ్చి స్ఫూర్తిగా నిలిచారని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా

## భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (+ఎ×ూూూ)' ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

నేనున్నంత వరకు

## బీఆర్ఎస్ సర్కారు రానివ్వను

ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. " నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

కీలక నేతల మధ్య విభేదాలపై

## భాజపా అధిష్ఠానం దృష్టి

సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు.

యూట్యూబర్ రావణ్ రిమాండ్

## పొడిగించిన న్యాయస్థానం

ప్రవేశపెట్టారు. కేసు తీవ్రతను పరిశీలించిన కోర్టు, రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... సమాజంలోని పలువురు ప్రముఖుల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, ఆ వీడియోలను సోషల్ మీడియా వేదికగా వైరల్ చేయడంతో జోసెఫ్‌పై గతంలోనే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అయితే, ఈ అరెస్ట్ అనంతరం అతడి వ్యక్తిగత మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా, మరికొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ నిషేధిత గ్రూపులైన మావోయిస్టుల సిద్ధాంతాలను సమర్థిస్తూ రావణ్ ప్రత్యేకంగా వీడియోలు రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డిజిటల్ ఆధారాలతో కేసు తీవ్రత పూర్తిగా మారిపోయింది. దేశ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించేలా వ్యవహరించినందుకు గానూ అతడిపై దేశద్రోహం కేసుతో పాటు, అత్యంత కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అదనపు సెక్షన్లను నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు.

## 'మిషన్ ఆగమన్' ప్రయోగం విజయవంతం

ప్రవేశపెట్టేలా విక్రమ్-1ను డిజైన్ చేశారు. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసర్ఫ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్ స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్ కు చెందిన 'స్కోప్' ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకెళ్లారు. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ కు చెందిన కాస్మిక్ బ్లూమ్ అనే కళాకృతిని, మరో మైక్రో-ఆర్ట్ పీస్ ను పంపారు. అంతరిక్ష ప్రయోగాల్లో ఖర్చును తగ్గించడంతో పాటు ఉపగ్రహాలను వేగంగా కక్ష్యలోకి చేర్చేందుకు వీలుగా విక్రమ్-1 రాకెట్ ను రూపొందించారు. ఈ కార్యక్రమంలో స్కైరూట్ ఏరోస్పేస్ కో-ఫౌండర్, సీఈవో పవన్ కుమార్ చందన, ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కే.నారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే

## కూటమి ప్రభుత్వ లక్ష్యం

సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చీపుర్లను చేతబట్టి, విద్యార్థిని, విద్యార్థులు గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని తుడిచి శుభ్రం చేశారు. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు పరిసరాలు పరిశుభ్రత, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేతులను దగ్గర ఉండి శుభ్రం చేయించారు. విద్యార్థులతో మంత్రి కాసేపు ముచ్చటించారు. మొక్కలను నాటి, అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - 2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్జీఓలు, కార్పొరేటు సంస్థలు, విద్యార్థులు, యువత, సేవా సంస్థలు, స్వచ్ఛందంగా పాల్గొనాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు అందరూ పాల్గొని, మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏదో జిల్లాలో పాల్గొని, అందరికీ స్ఫూర్తిని నిశీపుతున్నారని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే, వ్యాధులు సోకుతాయని, ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆర్థికంగా బలహీనులు అవుతారని అన్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. "స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం కేవలం పరిశుభ్రత కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ప్రతి పౌరుడు బాధ్యతగా పాల్గొని రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, అభివృద్ధి దిశగా నడిపించే ప్రజా ఉద్యమం అన్నారు. పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలు మన ఆరోగ్యానికి, పర్యావరణానికి, భావి తరాలకు అమూల్యమైన సంపద అన్నారు. మన పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరీ బాధ్యత అని, మనఇల్లు, మనవీధి, కార్యాలయం, పాఠశాల, ఎక్కడైనా పరిశుభ్రతను పాటించడం ద్వారా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ద గలమని అన్నారు. ప్రజలు సహకారంతో చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేయడం, ప్లాస్టిక్, క్యారీ బ్యాగులను వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా చేస్తే, మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు భాగస్వామ్యం తోడైతేనే ఈ లక్ష్యం సాకారం తప్పక అవుతుందని అన్నారు. మనమంతా కలిసి పనిచేస్తేనే పరిశుభ్రమైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించగలమని అన్నారు. ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని, పరిశుభ్రతను మన జీవన విధానంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖలు అధికారులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన

## మానవత్వానికే మచ్చ

సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

హెచ్-1బీ వీసా.. ఈ ఏడాదికి

## రెండో లాటరీ లేనట్లే

ఎంపికైన వారి పూర్తి స్థాయి పిటిషన్‌లను సమర్పించేందుకు ఆయా సంస్థలకు ఇచ్చిన (జూన్ 30, 2026 నాటికే) గడువు ముగిసిందని తెలిపింది. దీంతో ఈ ఏడాది రెండోసారి లాటరీ నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది. అమెరికా కంపెనీలు విదేశీ వృత్తి నిపుణులను నియమించుకునేందుకు ఏటా 85 వేల హెచ్-1బీ వీసాలు జారీ చేస్తుంది. ఇందులో 65 వేల వీసాలు రెగ్యులర్, మాస్టర్ క్యాప్ కింద 20 వేల వీసాలను ఇస్తుంది. హెచ్-1బీ వీసాలకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ 2.11లక్షల రిజిస్ట్రేషన్లు వచ్చినట్లు యూఎస్‌సీఐఎస్ ఇటీవల వెల్లడించింది. గత ఏడాది 3.43లక్షల రిజిస్ట్రేషన్లు రాగా.. ఈసారి వాటి సంఖ్య 38.5శాతం తగ్గినట్లు పేర్కొంది. ఇక వీసాకు ఎంపికైన ఉద్యోగుల కాలపరిమితి అక్టోబర్ 1, 2026 నుంచి మొదలవుతుంది.

**కొత్త విధానంలో లాటరీ..?**

హెచ్-1బీ వీసాలను లాటరీ విధానంలో ర్యాండమ్‌గా ఎంపిక చేస్తుండగా.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈసారి కొన్ని మార్పులు చేసింది. అత్యధిక వేతనాలు, ఉన్నత నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు (లెవల్ 4) వీసా పొందే అవకాశాలు ఎక్కువగా ఉండేలా కొత్త విధానాన్ని రూపొందించారు. తక్కువ వేతనం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఎంపిక వివరాలను త్వరలో ప్రకటిస్తామని యూఎస్‌సీఐఎస్ వెల్లడించింది.

## మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ సతీమణి చెన్నమ్మ కన్నుమూత

పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా చెన్నమ్మ మృతి పట్ల సంతాపం తెలిపారు. "మాజీ ప్రధాని దేవెగౌడ అర్ధాంగి చెన్నమ్మ మరణవార్త నన్ను తీవ్రంగా బాధించింది. దేవెగౌడకి, కుమారస్వామికి, వారి కుటుంబ సభ్యులందరికీ నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ కష్టకాలంలో వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు.

హర్మూజ్‌లో ట్యాంకర్ల పేలుడు వార్తలు..

## స్పందించిన అమెరికా

ఢీకొట్టి పేలిపోయాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది.

**కువైట్‌లో నిలిచిన విమాన కార్యకలాపాలు..**

తమ దేశంలోని యూఎస్ బేస్‌ల లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండటంతో కువైట్ విమాన కార్యకలాపాలను నిలిపివేసింది. అమెరికా సైనిక బలగాలకు ఆశ్రయం ఇస్తోన్న దేశాలపై తమ దాడులు కొనసాగుతూనే ఉంటాయని మరోవైపు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఆ దేశాలు తమ పౌరుల్ని రక్షించుకునే ప్రయత్నాలు చేసుకోవాలని సూచించింది.

# ఎడిటర్ వాయిస్

## మావిగన్ జగన్ కాదట... వెనక ఆ పార్టీ ఉందట!

మావిగన్ అని కొత్త సూత్రీకరణ చేశారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. అయితే మావిగన్ అన్నది జగన్ సొంత ఆలోచన కాదని దాని వెనక ఒక బడా పార్టీ ఉందని కాంగ్రెస్ కి చెందిన సీనియర్ నాయకుడు మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రత్యేక హోదాను లేకుండా చేయడానికి ఏపీ శాశ్వతంగా అడగకుండా చూడడానికే మావిగన్ పేరుతో కొత్త నాటకం అని ఆయన అంటున్నారు.

**రాజధాని విషయంలోనూ :** ఇదిలా ఉంటే ఏపీ రాజధాని విషయంలో అటు చంద్రబాబు ఇటు జగన్ ఇద్దరూ రాజకీయ నాటకం ఆడుతున్నారని హర్షకుమార్ విమర్శించారు. ఏపీకి సంజీవిని లాంటి ప్రత్యేక హోదాను ఈ రెండు ప్రాంతీయ పార్టీలు పూర్తిగా పక్కన పెట్టేశాయని, పైగా బీజేపీ డైరెక్షన్ లో నడుస్తూ రాజధాని విషయంలో వారు చెప్పినట్లే వ్యవహరిస్తున్నాయని ఆయన అంటున్నారు. మావిగన్ పేరుతో కేవలం విజయవాడ మచిలీపట్నం, గుంటూరులను అభివృద్ధి చేస్తే సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. అలాగే టీడీపీ కూడా అమరావతిలోనే ఈ ప్రాంతాలు ఉన్నాయని చెబుతోంది అని ఆయన గుర్తు చేశారు. ఈ విధంగా అభివృద్ధి కేంద్రీకరణ వల్ల ఏపీకి ఏమి ఒరుగుతుందని ఆయన నిలదీశారు.

**బీజేపీ తెర వెనక :** ప్రత్యేక హోదా డిమాండ్ ని పూర్తిగా లేకుండా చేయడానికి బీజేపీ తెర వెనక ఉంటూ మావిగన్ వంటి ప్రతిపాదనలు చేయిస్తోంది అని ఆయన మండిపడ్డారు. ఇది బీజేపీ రూపొందించిన అలాగే ప్రాంతీయ నాయకుల ద్వారా అమలు చేయబడిన ఒక మోసపూరిత ప్రణాళికగా హర్షకుమార్ అభివర్ణించారు. ఏపీకి బీజేపీ ద్రోహం చేసింది అని ఆయన అన్నారు. ఏపీ ఆర్థిక ప్రయోజనాలు అన్నీ కూడా ప్రత్యేక హోదా వంటి వాటితో ముడిపడి ఉన్నాయని ఆయన అంటున్నారు. అయితే వాటి నుంచి తప్పించేందుకు రాజకీయ పెయిన్ కిల్లర్ లాంటి ఒక ఫార్ములాయే మావిగన్ ఫార్ములా అని హర్ష కుమార్ అభివర్ణించారు.

**చిన్న ప్రాంతానికే అభివృద్ధి :** కేంద్ర బీజేపీ నాయకత్వం ఆదేశాల మేరకే ఏపీలో టీడీపీ వైసీపీ జనసేన పనిచేస్తున్నాయని ఆయన ఫైర్ అయ్యారు. రాష్ట్రంలోని అభివృద్ధిని అంతా ఒక చిన్న కేంద్ర ప్రాంతానికే పరిమితం చేయాలన్నదే ఈ ఎత్తుగడ అని హర్ష కుమార్ వివరించారు. ప్రధాన పార్టీలు అన్నీ ప్రత్యేక హోదా కోసం పోరాడటానికి బదులుగా ఇలాంటి ప్రతిపాదనలు చేయడమేంటి అని ఆయన ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా వస్తే దాని ద్వారా అన్ని జిల్లాల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అలాంటి హోదాకు పోరాడే బదులు ప్రజల డిమాండ్లను అణచివేసేందుకు ప్రాంతీయ పార్టీలు మావిగన్ ఫార్ములాను ఒక తాత్కాలిక పరిష్కారంగా చూపిస్తున్నాయని ఆయన ఫైర్ అయ్యారు.

**దానికి సాటి రాదు :** ఇక ప్రత్యేక హోదా అంటే ఏపీ సర్వతోముఖాభివృద్ధి అని హర్షకుమార్ అన్నారు. పూర్తి స్థాయి ప్రత్యేక హోదాతో లభించే ఆర్థిక ప్యాకేజీలు, పారిశ్రామిక రాయితీలు పన్ను మినహాయింపులతో ఏపీ అన్ని విధాలుగా బాగుపడుతుందని అన్నారు. అయితే దానికి బదులుగా కేవలం కొన్ని ఎంపిక చేసిన నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన ఏపీకి ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదని మాజీ అమలాపురం ఎంపీ వాదిస్తున్నారు. ఇలాగైతే వెనకబడిన ఉత్తరాంధ్రా, రాయలసీమ వంటి ప్రాంతాల సంగతి ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ప్రత్యేక హోదా డిమాండ్‌ను పూర్తిగా నీరు గార్చడానికి ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా కేంద్రంపై ఆధారపడేలా చేయడానికి ప్రాంతీయ పార్టీలను వాడుకుంటోందని హర్ష కుమార్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలకడగా పోరాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## సంగారెడ్డిలో దారుణం.. 18 రోజుల పసికందును నేలకేసి కొట్టి చంపిన తండ్రి

**జోగిపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంగారెడ్డి జిల్లా జోగిపేటలో దారుణం చోటు చేసుకుంది. 18 రోజుల పసికందును నేలకేసి కొట్టి.. కన్నతండ్రే హతమార్చాడు. సీఐ అనిల్ కుమార్ వెల్లడించిన వివరాల మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన కృష్ణ, గౌరమ్మ దంపతులు.. పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇవాళ ఉదయం కూడా తన భార్యతో గొడవపడిన కృష్ణ.. పాలు తాగుతున్న బిడ్డను లాక్కొని.. చిన్నారి చెంపలపై కొట్టాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించింది. కోపోద్రిక్తుడైన కృష్ణ.. చేతిలో ఉన్న పసికందును నేలకేసి కొట్టాడు. గౌరమ్మ గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పసికందును జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు బోల్తా.. ప్రయాణికులకు గాయాలు




**కొండపి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లాలో ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. కొండపి నుంచి మద్దులూరు మీదుగా ఒంగోలు వస్తున్న పల్లెవెలుగు బస్సు కొండపి-మద్దులూరు మార్గంలో ద్వారకా సీఫుడ్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో బస్సును తప్పించబోయి పక్కకు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 20 మంది వరకు విద్యార్థులు ఉన్నట్టు సమాచారం. రోడ్డు పక్కన ముళ్ల చెట్లు దట్టంగా ఉండటంతో.. మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బస్సు కనిపించకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రులను కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## గుంటూరులో నడిరోడ్డుపై.. మహిళను వివస్త్రను చేసి దాడి

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరులో నడిరోడ్డుపై ఓ మహిళను వివస్త్ర చేసిన అమానవీయ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 15న రాత్రి కృష్ణబాబుకాలనీకి చెందిన ఓ మహిళ తన ఇంటి ముందున్న కుళాయి నుంచి మోటార్ ద్వారా నీరు పట్టుకుంటున్నారు. మోటార్ తొలగించాలని స్థానిక 21వ డివిజన్ తెదేపా కార్యదర్శి మల్లెల వెంకటరమణమూర్తి, అతని కుటుంబసభ్యులు ఆమెతో వాగ్వాదానికి దిగి, తీవ్రంగా కొట్టారు. బాధితురాలు ఇంట్లోకి వెళ్లిపోతుండగా మూర్తి సోదరి, ట్రాన్స్‌జెండర్ మాధవి దాడి చేసి కొట్టింది. ఆమె వెంటపడి దుస్తులు చించేసి పూర్తిగా వివస్త్రను చేశారు. వదిలిపెట్టాలని బాధితురాలు ఎంతగా వేడుకున్నా కనికరించలేదు. నడిరోడ్డుపై మళ్లీ దౌర్జన్యానికి దిగగా.. స్థానిక మహిళలు అడ్డుకుని బాధితురాలికి దుస్తులు అందించారు. బాధితురాలు ఈ నెల 16న ఫిర్యాదు చేయడంతో మూర్తి, అతని సోదరితో కలిపి 9 మందిపై కేసు నమోదు చేశామని నగరంపాలెం సీఐ సత్యనారాయణ తెలిపారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**మూర్తిపై సస్పెన్షన్ వేటు:** మహిళల గౌరవం, భద్రతకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా సహించబోమని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21వ డివిజన్ కార్యదర్శి వెంకటరమణమూర్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు.

## రూ.500 కోసం వృద్ధుడిని నరికేశాడు



### మద్యానికి డబ్బులివ్వలేదని ఘాతుకం


**రెబ్బెన, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యానికి డబ్బులు అడిగితే లేవన్నందుకు వృద్ధుడిని పట్టపగలే అందరూ చూస్తుండగా గొడ్డలితో నరికి చంపిన దారుణ ఘటన శుక్రవారం కుమురం భీం జిల్లా రెబ్బెనలో జరిగింది. ఆసిఫాబాద్ మండలం పర్సనంబాల గ్రామానికి చెందిన మాసండి సోమయ్య(65), కరుణాబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. పెద్ద కుమార్తె లక్ష్మి హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తుండగా గురువారం ఆమె రెబ్బెన మండలం నంబాలలో ఉంటున్న చెల్లె సుజాత ఇంటికి వచ్చింది. ఆమెను చూసేందుకు అదే రోజు సోమయ్య దంపతులు నంబాలకు వచ్చారు. శుక్రవారం లక్ష్మి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండటంతో ఆమెను రైలు ఎక్కించేందుకు ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. కుటుంబీకులు అక్కడే ఉండగా సోమయ్య టీ తాగి వస్తానని చెప్పి రెబ్బెన బస్టాండ్ వైపు వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో అదే మండలం తుంగెడ గ్రామ పంచాయతీ పరిధి కొత్తగూడకు చెందిన ఓ వ్యక్తి మద్యానికి రూ.500 కావాలని ఆ వృద్ధుడిని అడిగినట్లు తెలిసింది. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో అందరూ చూస్తుండగానే తన వద్ద ఉన్న గొడ్డలితో సోమయ్య మెడపై బలంగా మోదడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అంతేగాకుండా తల, మొండెం వేరు చేసి రోడ్డు పక్కన పడేసి పారిపోతున్న సమయంలో కొందరు ఆపేందుకు ప్రయత్నించగా నిందితుడు వారిని భయపెట్టినట్లు తెలిసింది. బల్లార్షా వైపు వెళ్తున్న రైలు ఎక్కి వెళ్లిన అతడు తిరిగి అదే రైలులో వస్తుండగా సిర్పూర్(టి) రైల్వే స్టేషన్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కరుణాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సంజయ్ తెలిపారు.

## చికిత్స కోసం వెళ్తూ.. మృత్యు ఒడికి


### అంబులెన్సుకు ప్రమాదం.. ఐదు రోజుల పసికందు మృతి




**ఆళ్లగడ్డ, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల జిల్లా చాగలమర్రి సమీపంలో 40వ నంబరు జాతీయరహదారిపై శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరుకు చెందిన రైల్వే ఉద్యోగి శంకర్‌రావు, పద్మజ దంపతులకు కడపలో ఐదు రోజుల క్రితం కవల పిల్లలు పుట్టారు. వారికి ఆరోగ్యపరిస్థితి బాగోలేకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలిస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ప్రైవేటు అంబులెన్స్ రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనదారుడిని ఢీకొని, అదుపు తప్పి కల్వర్టు రక్షణ గోడను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అంబులెన్సులోని ఒక చిన్నారి (మగ శిశువు) వాహనంలోనే కిందపడటంతో నుదుటిపై తీవ్రగాయాలయ్యాయి. మరో చిన్నారి(ఆడ శిశువు) సైతం గాయపడగా హైవే అంబులెన్సులో ఆళ్లగడ్డలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ మగపిల్లవాడు కోలుకోలేక మృతిచెందాడు. మరో చిన్నారిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ కడప జిల్లా గోపాయపల్లెకు చెందిన ద్విచక్రవాహన దారుడు రామకృష్ణారెడ్డిని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.






### అవినీతిపరులను ఉపేక్షించొద్దు..

**ఎమ్మెల్యే చినరాజప్పకు ప్రజల విజ్ఞప్తి!**

నియోజకవర్గంలో ఎంతో మంచి పేరున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇమేజ్‌ను డ్యామేజ్ చేసే విధంగా సొంత పార్టీ ముసుగులో ఇలాంటి అక్రమాలకు పాల్పడటం క్షమించరాని నేరమని స్థానికులు అంటున్నారు. పార్టీతో సంబంధం లేకుండా ఈ 19 లక్షల రూపాయల దోపిడీకి కారణమైన యానిమేటర్ కిమిడి వెంకటలక్ష్మిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేసి, పేద ప్రజల సొమ్మును రికవరీ చేయించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

**వడ్డీ భారంతో**

### కుంగిపోతున్న పేద ప్రజలు!

తాము రూపాయి రూపాయి కూడబెట్టి, బ్యాంకులకు సకాలంలో చెల్లించిన రుణ వాయిదాలను యానిమేటర్ తన సొంతానికి వాడుకోవడంతో.. ఇప్పుడు బ్యాంకు ఖాతాల్లో ఆ సొమ్ము పూర్తిగా జమ కాలేదు. దీనివల్ల ఖాతాలపై అదనపు వడ్డీ భారం పడుతోందని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సామర్లకోట, కాకినాడ జిల్లా (విశ్వం వాయిస్ న్యూస్) :** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కాపవరం గ్రామంలో స్వయం సహాయక సంఘాల నిధుల నిర్వహణలో జరిగిన భారీ అక్రమాలు ఇప్పుడు నియోజకవర్గంలో పెద్ద రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ఈ నిధుల దోపిడీకి పాల్పడిన గ్రామ సంఘ సహాయకురాలు కిమిడి వెంకటలక్ష్మి తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో, ఈ వ్యవహారం స్థానిక శాసనసభ్యులు (ఎమ్మెల్యే) నిమ్మకాయల చినరాజప్పకు అనవసరమైన చెడ్డపేరు తెచ్చిపెట్టినట్లయింది. పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా సొంత పార్టీ శ్రేణులే ఇలాంటి అవినీతికి పాల్పడటంపై నియోజకవర్గంలోని ప్రజలు, తటస్థులు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**ఎమ్మెల్యే చినరాజప్ప ప్రతిష్టకు భంగం కలిగించిన సొంత పార్టీ నేత!**

నియోజకవర్గంలో ఎంతో నిబద్ధత కలిగిన నాయకుడిగా, క్లీన్ ఇమేజ్ ఉన్న ప్రజాప్రతినిధిగా పేరు తెచ్చుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేరును, సదరు యానిమేటర్ తన స్వార్థం కోసం వాడుకోవడంపై స్థానిక తెలుగుదేశం శ్రేణులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తప్పు చేసిన యానిమేటర్ వెంకటలక్ష్మికి అండగా నిలబడే ప్రసక్తే లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని పార్టీ ముఖ్య నేతలు, గ్రామ పెద్దలు స్పష్టం చేశారు. అయినప్పటికీ, ప్రతిపక్షాలకు ఆయుధంగా మారిన ఈ 17 లక్షల కుంభకోణం వ్యవహారం స్థానిక నియోజకవర్గ రాజకీయాల్లో ఎమ్మెల్యేకు ఊహించని ఇరకాటాన్ని తెచ్చిపెట్టింది.

**నెల రోజుల జల్లెడ.. బయటపడ్డ 17 లక్షల దోపిడీ!**

ఈ నిధుల దుర్వినియోగంపై సాంబమూర్తి మండల వెలుగు ఏరియా ప్రాజెక్ట్ మేనేజర్ జగదీశ్వరి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అధికారిక వివరాలను వెల్లడించారు. కార్తికేయ గ్రూప్ నుంచి వచ్చిన రాతపూర్వక ఫిర్యాదుతో తాము బ్యాంకు లావాదేవీల పరిశీలన ప్రారంభించామని తెలిపారు. గ్రామంలోని సభ్యులంతా ప్రతి నెల బ్యాంకు వాయిదాలు చెల్లించాల్సిందిగా నమ్మి కిమిడి వెంకటలక్ష్మి చేతికి నగదు ఇచ్చేవారు. అయితే ఆ సొమ్మును బ్యాంకులో జమ చేయకుండా సదరు





యానిమేటర్ తన సొంత ఖర్చులకు ఉపయోగించుకుందని అధికారులు తేల్చారు. ప్రతి నెల కట్టాల్సిన వాయిదాల్లో సగం సగం కట్టడం, కొన్ని వాయిదాలను పూర్తిగా మిస్ చేయడం, అలాగే ప్రతి వాయిదాలో నాలుగు వేల నుంచి ఐదు వేల రూపాయల వరకు తగ్గించి కట్టడం వంటి చేతివాటాన్ని ప్రదర్శించినట్లు బ్యాంకు రికార్డుల ద్వారా రూఢీ అయింది. ఇప్పటివరకు 21 సంఘాల పరిధిలోనే సుమారు రూ.17 లక్షల వరకు అవినీతి జరిగినట్లు జగదీశ్వరి అధికారికంగా ధ్రువీకరించారు. భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో సదరు యానిమేటర్ కిమిడి వెంకటలక్ష్మిని తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు.

**అర్ధరాత్రి వేళ యానిమేటర్ ఇంటి ముట్టడి.. పంచాయితీలో 10 లక్షల చెక్కుల జప్తు!**

అక్రమాల విషయం పూర్తిగా వెలుగులోకి రావడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన బాధితులంతా ఏకమై సోమవారం రాత్రి కాపవరం గ్రామంలోని యానిమేటర్ వెంకటలక్ష్మి నివాసాన్ని ముట్టడించారు. తమ కష్టార్జితాన్ని మింగేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నిలదీయడంతో అర్ధరాత్రి వరకు గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉండటంతో, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, తెలుగుదేశం నాయకులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నైతిక విలువల పద్ధతికి లోబడి, తప్పు చేసిన వారికి పార్టీ రక్షణ ఉండబోదని స్పష్టం చేస్తూ.. ఉభయ పక్షాల సమక్షంలో సుదీర్ఘ చర్చలు జరిపి వివాదాన్ని తాత్కాలికంగా సద్దుమణిగేలా చేశారు. ఈ పంచాయితీలో తానే తప్పు చేసినట్లు ఒప్పుకున్న యానిమేటర్.. బాధితులకు 10 రోజుల గడువులోగా నిధులన్నీ చెల్లిస్తానని అంగీకరించినట్లు సమాచారం. ఇందుకు గ్యారెంటీగా ఐదు లక్షల చొప్పున రెండు బ్యాంకు చెక్కులు, రెండు ప్రామిసరీ నోట్లను గ్రామ పెద్దల సమక్షంలో బాధితులకు అందజేశారు.

**బుకాయింపులు.. అధికారులపైనే లంచం రంగు!**

బ్యాంకు రికార్డులు బద్దలు కొడుతున్నా సదరు యానిమేటర్ ఇంకా తప్పు ఒప్పుకోకుండా తప్పించుకునేందుకు కొత్త నాటకాలకు తెరలేపుతోందని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాను ఇంకా నిరూపించుకోవాలంటూ కాలయాపన చేస్తూ.. విచారణకు వచ్చిన అధికారులపైనే రాజమ్మ అనే ఆవిడ దగ్గర ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. "నన్ను అధికారులు లంచం అడిగారు.. నేను ఇవ్వనందుకే నన్ను ఈ ఊర్లో ఇరికించారు" అంటూ కొత్త పల్లవి అందుకుందని బాధితులు మండిపడ్డారు. "అధికారులు లంచం అడిగారో లేదో పక్కన పెడితే.. బ్యాంకు నుంచి వచ్చిన అధికారిక రికార్డులు అబద్ధం చెబుతాయా? బ్యాంకు కాగితాలు నిజాయితీగానే ఉంటాయి కదా!" అని యానిమేటర్ తీరును తీవ్రంగా నిలదీశారు.

**ఆ ఒక్క యువకుడి పోరాటంతోనే ఊరంతా మేల్కొంది!**

ఈ నిధుల దోపిడీ వెనుక ఓ ఆసక్తికరమైన నిజాన్ని బాధితులు స్థానిక వార్తా ప్రతినిధులకు వివరించారు. కార్తికేయ గ్రూప్‌నకు చెందిన ఒక యువకుడు తనకు జరిగిన అన్యాయంపై గట్టిగా నిలబడటం వల్లే ఈ రోజు ఈ నిధుల దోపిడీ బయటపడిందని వారు తెలిపారు. గ్రూపునకు సంబంధించి 70 వేల అప్పు విషయంలో సదరు యువకుడు ఐదు రూపాయల వడ్డీకి తెచ్చి మరీ బ్యాంకులో కట్టానని, కానీ ఆ సొమ్ము జమ కాలేదని గట్టిగా పట్టుబట్టాడు. ఒకవేళ ఆ యువకుడు కూడా లొంగిపోయి ఉంటే.. ఈ పాటికి ఊరంతా ఇంకా చీకట్లోనే ఉండేవాళ్ళమని, ఇప్పటికీ యానిమేటర్ ఆ యువకుడిని అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. "ఆ యువకుడు నిలబడకపోతే మేమంతా నమ్ముతూనే ఉండేవాళ్ళం" అని ఆవేదన చెందారు.

**ఇంకా 16 సంఘాల లెక్కలు తేలాలి.. పెరగనున్న అవినీతి విలువ!**

గ్రామంలో మొత్తం 37 సంఘాలు ఉండగా, ఇప్పటివరకు 21 సంఘాల పరిధిలోనే ఈ 17 లక్షల మేర అవినీతి బయటపడింది. ఇంకా మిగిలి ఉన్న 16 సంఘాల లెక్కలతో పాటు, స్త్రీనిధి, ఉన్నతి రుణాలు, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. కేవలం గత రెండేళ్ల గ్రామ సంఘం నిధులను పరిశీలిస్తేనే సుమారు లి5 లక్షల 50 వేల రూపాయలులి మాయమైనట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన సంఘాల లెక్కలు కూడా పూర్తయితే అక్రమాల నిధుల వేట మరిన్ని లక్షలు దాటి, కోట్ల రూపాయలకు చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై ప్రాథమిక నివేదికను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, తప్పు చేసిన వారిపై శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

**కోరుకొండలో ఘనంగా**

## బదిరెడ్డి 57వ జన్మదిన వేడుకలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధ్యాత్మికవేత జనసేనపార్టీ సీనియర్ నాయకులు బదిరెడ్డి దొర జన్మదిన వేడుకలు కోరుకొండలో పలుచోట్ల ఎన్డీఏ నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. శనివారం జనసేన పార్టీ నాయకులు బదిరెడ్డి 57వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కోరుకొండ శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరుకొండలోని పలు ప్రాంతాల్లో ఎన్డీఏ నాయకులు, అభిమానులు పలుచోట్ల బదిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, ఆప్యాయతగా హత్తుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. బదిరెడ్డి పలు దేవాలయాల నిర్మాణానికి, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు చేసిన సేవలను కొనియాడారు. పలువురు బదిరెడ్డికి పూలమాలవేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కటకం చలం, కర్రి వీర గణేష్, కటకం సత్యనారాయణ, నీరుకొండ బాబ్జి, వాతాడ గోపి, బడగళ్లపాటి శ్రీనివాస్, సుంకర శ్రీను, కోలా వీరేష్, ముషిని శ్రీను, పలువురు ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

**ముంపు నివారణకు**

## సమగ్ర ప్రణాళిక రూపొందించాలి : కమిషనర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ఎక్కడా వర్షపు నీటి నిల్వలు లేకుండా, ముంపు నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ముంపు నివారణపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వ హించారు. వర్షాలు కురిసిన సమయంలో కోరుకొండ రోడ్డు, హైటెక్ బస్టాండ్ సహా పలు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడటానికి గల కారణాలను ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థలో కనెక్టివిటీ సక్రమంగా ఉందా, ఎక్కడైనా గ్యాప్‌లు ఉన్నాయా, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏమైనా ఉన్నాయా..? అనే అంశాలపై సమీక్షించారు. డ్రైనేజీ కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు గుర్తించిన గ్యాప్‌లను వెంటనే సరిచేసి, వర్షాల సమయంలో రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఈఈ మదర్షా అలీ, ఎంహెచ్ఓ వినూత్న, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# అధికారులు, నీటి సంఘం ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు సకాలంలో సాగునీరు, ప్రజలకు సురక్షిత తాగునీరు నిరంతరాయంగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో వ్యవసాయ, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల అధికారులు, నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి కాలువలు, డ్రెన్లు, ఇరిగేషన్ ఆస్తుల ఆక్రమణలను ఉపేక్షించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించి ధృవీకరణ అనంతరమే బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. ప్రధాన, ఉప కాలువల్లో పూడిక తొలగింపు, కలుపు మొక్కల నిర్మూలన, లీకేజీల మరమ్మతులు పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతులకు కూడా సమానంగా నీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు రానున్న 10–15 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి, జిల్లా రెవెన్యూ అధికారి సుబ్బారావు, ఇరిగేషన్ శాఖ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘన, జీవ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు : ఎమ్మెల్యే బండారు

## పరిసరాలు, మనుషుల ఆరోగ్యం పాడవకుండా వ్యర్థాల నిర్వహణ తప్పనిసరి



**ఊబలంక, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన సమాజం కావాలంటే వ్యర్థాల నిర్వహణ పరిపూర్ణంగా జరగాలని, పరిసరాలు,మనుషుల ఆరోగ్యం పాడవకుండా ఘన,జీవ, ప్లాస్టిక్ మొదలైన వ్యర్థాలను నిర్వహించడం ముఖ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన ఊబలంక పిహెచ్సీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పీహెచ్సీ లో ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణకు వినియోగించే నాలుగు రకాల డబ్బాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలను నాటారు.ప్రతిజ్ఞ నిర్వహించారు. పీహెచ్సీలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి వ్యర్థాల నిర్వహణపై సిబ్బందితో మాట్లాడారు. వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోతే పరిసరాలు కలుషితమై వ్యాధులు వ్యాపిస్తాయని తెలియజేశారు. ఘన వ్యర్థాలు కానీ, జీవ వ్యర్థాలు కానీ,ప్లాస్టిక్ గాని వ్యర్థాల నిర్వహణ అనేది ప్రస్తుతం సమాజానికి ఒక సవాలుగా ఉందన్నారు. నేల, నీరు, పర్యావరణం కలుషితం కాకుండా వ్యర్థాలన్నీ సేకరించి రీసైక్లింగ్ చేయడం మొదలైన కార్యక్రమాలను సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తాయని, ప్రభుత్వాసుపత్రులకు వచ్చేవారు సైతం పేదలే ఉంటారని ఎమ్మెల్యే అన్నారు. వైద్యులు అంటేనే దేవుడితో సమానమని, పిహెచ్సీకి వచ్చే రోగులకు సరియైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులకు సిబ్బందికి ఉద్యోగ భద్రత ఉంటుందని, ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందికి అటువంటి భద్రత ఉండదన్నారు. ప్రజలకు ఎంతవరకు సేవ చేయగలిగితే అంతవరకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్న స్థానిక నాయకులను కానీ, తనను కానీ సంప్రదించాలన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు

# తప్పనిసరిగా పాటించాలి : కమిషనర్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలాపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం 17వ వార్డులోని ఐఎస్‌వీ సిగ్నేచర్ గ్రాండ్ అపార్ట్మెంట్‌లో "బల్క్ వేస్ట్ జనరేటర్స్ గుర్తింపు" అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026 అమలు, బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు, వాటి నిర్వహణపై అపార్ట్మెంట్ యజమానులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2026 ప్రకారం రోజుకు 100 కిలోలకుపైగా చెత్త ఉత్పత్తి చేసే లేదా 20,000 చదరపు మీటర్లకు పైగా ఫ్లోర్ ఏరియా కలిగిన, రోజుకు 40,000 లీటర్లకు పైగా నీటి వినియోగం ఉన్న అపార్ట్మెంట్లు, హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, ఇతర వాణిజ్య సంస్థలను బల్క్ వేస్ట్ జనరేటర్లా గుర్తిస్తామని తెలిపారు. అటువంటి సంస్థల యజమానులు తప్పనిసరిగా తమ ప్రాంగణంలోనే సేంద్రియ వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ చేపట్టాలని సూచించారు. అలాగే తడి, పొడి, శానిటరీ, ప్రమాదకర వ్యర్థాలుగా చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాల్సిన విధానాన్ని వివరించారు. అనంతరం అందరితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డీఈఈ కె.వి.వి.సత్యనారాయణ, ఏఈలు కె.వెంకటేష్, డి.సూర్యభాస్కర్, మేనేజర్ డి.ప్రభాకరరావు, అర్బన్ స్వర్ణ వార్డు ఆఫీసర్ జి.శ్రీహరి, ఐఎస్‌వీ సిగ్నేచర్ గ్రాండ్ అపార్ట్మెంట్ అధ్యక్షుడు డి.వి.ఎస్.సత్యనారాయణ రాజు, కార్యదర్శి డి.రామచంద్రరావు, మాజీ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

138 ఏళ్ల నాటి

# పీడబ్ల్యూడీ భవనం శిథిలావస్థ



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం మండలంలోని సమనసలాకు కేంద్రంలో పీడబ్ల్యూడీ సూపరింటెండెంట్‌కు కార్యాలయం, నివాస భవనం నిర్మించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. బ్రిటీష్ కాలంలో 1888లో నిర్మించిన పాత భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు పనిచేయడానికి, బస చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు సమనసలాకును సందర్శించిన నేపథ్యంలో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు విజ్ఞప్తి చేశారు. పాత భవనాలను తొలగించి ఆధునిక సౌకర్యాలతో కొత్త కార్యాలయం, నివాస భవనం నిర్మించాలని కోరారు. ఈ సమస్యపై పలుమార్లు వార్తలు ప్రచురితమైనప్పటికీ పీడబ్ల్యూడీ అధికారులు స్పందించలేదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

రోడ్డుపై ఇటుక ట్రాక్టర్ల అక్రమ పార్కింగ్‌తో

# వాహనదారుల అవస్థలు



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని ఈదరపల్లి వంతెన దిగువ, బజాజ్ షోరూమ్ ఎదురుగా రహదారికి ఇరువైపులా ఇటుకలతో వచ్చిన ట్రాక్టర్లను పార్క్ చేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఇరుకుగా ఉన్న రహదారిపై ట్రాక్టర్లు నిలిపివేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రద్దీ వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రోడ్డుపై ట్రాక్టర్ల పార్కింగ్‌ను నివారించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# ఆరోగ్యానికి వ్యాయామమే రక్ష

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్ స్టూడెంట్స్ బొక్క శాంతిరాజు (అఖిల్ )సిల్వర్ మెడల్ సాధించారని కోచ్ వాసంశెట్టి నరేష్ తెలిపారు. విజేతకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మెడల్స్ వేసి అభినందించారు. ఆరోగ్యం కోసం చాలా డబ్బు కర్చుపెడుతున్న రోజులని, ఎంతటి కోటీశ్వరుడు అయినా ఆరోగ్యం లేకుంటే జీవితం వృదా ..కాబట్టి రోజు వ్యాయామం అలవాటు చేసుకుంటే హెల్దీ గా ఉంటారని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో నలమాటి వికాస్, నేషనల్ పవర్ లిఫ్టర్స్ దొమ్మేటి వేణు సాగర్, మేడిది సందీప్ పాల్గొన్నారు.

# ఉప్పలగుప్తంలో ఘోర రోడ్డు ప్రమాదం



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం అయితాబత్తుల వారిపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. చేపల వేటకు వెళ్లి పట్టిన చేపలను ఆటోలో తీసుకుని తిరుగు ప్రయాణంలో ఉండగా, ఆటో అదుపుతప్పి బోల్తా పడినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కొండుపర్తి లోకేష్ (ఎస్సీ), సంగాని రాజు (అగ్నికుల క్షత్రియ) అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.


సాగునీరు అందక ఎండిపోతున్న

# ఆరుమళ్లను పరిశీలించిన వైసీపీ నాయకులు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు గ్రామంలో సాగునీరు అందక ఎండిపోతున్న ఆరుమళ్లను జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీమతి చింతా అనురాధ, వైసీపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగునీరు విడుదల కాకపోవడంతో పంటలు ఎండిపోతున్న దుస్థితిని పరిశీలించి, రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఎండిపోయిన ఆరుమళ్ల మధ్య నిరసన ప్రదర్శన చేపట్టారు. రైతులకు వైయస్ఆర్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జున్నూరి బాబీ, అమలాపురం అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, రాజోలు అసెంబ్లీ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కటకంశెట్టి ఆదిత్య, పొనకాల గణేష్, సలాది సతీష్, సంసాని నాని, వంగా గిరిజ, కొనుకు గౌతమి, బర్రె సీతారత్నం, రాపాక విజయలక్ష్మీ, అంబికా శ్రీను, వైసీపీ నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా ఎం.బాల సరస్వతి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల సంస్థ నూతన మేనేజర్‌గా కుమారి ఎం.బాలసరస్వతి బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పౌర సరఫరాల సంస్థ ఇంచార్జ్ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమె రెగ్యులర్ జిల్లా మేనేజర్‌గా పదోన్నతి పొంది కోనసీమ జిల్లాకు రావడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇదే జిల్లాలో ఇన్చార్జి జిల్లా మేనేజర్‌గా సమర్థవంతమైన సేవలందించి మళ్లీ రెగ్యులర్ హోదాలో జిల్లాకు రావడంతో పౌరసరఫరాల ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం





**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు 2026 - 2027 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయుటకు అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఈ గురుకుల విద్యా సంస్థలలో చేరడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు ద్రాక్షారామం, గోడి బాలుర విద్యా సంస్థ, గోడి బాలికల విద్యా సంస్థ, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు ప్రాంతాలలో ఉన్న సంబంధిత పాఠశాలలు లేదా కళాశాలలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారాలను పొంది, వాటిని పూర్తి చేసి తమ యొక్క విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు, కుల ఆదాయ ద్రవీకరణ పత్రాలు, విద్యార్థి ఆధార్ కార్డు మరియు తల్లిదండ్రుల యొక్క ఆధార్ కార్డులతో నేరుగా అడ్మిషన్ పొందవచ్చు. వివిధ తరగతులలో ఉన్న ఖాళీల పూర్తి వివరాలను తెలుసుకునుటకు, దరఖాస్తు ఫారాల కొరకు ఆయా పాఠశాలలను నేరుగా సంప్రదించవలసి ఉంటుందని పశ్చిమ గోదావరి మరియు కోనసీమ జిల్లాల గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త ఎస్.తబిత ఒక ప్రకటనలో తెలియజేశారు.

# భవాని ప్రసాద్‌కి అక్షయ ఆర్థిక సహాయం



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్తిలి మండలం బొంతు వారి పాలానికి చెందిన బొంతు భవాని ప్రసాద్ అనే 19 సంవత్సరాల అబ్బాయి అత్తిలి నుంచి భీమవరం కాలేజీకి డైలీ ట్రైన్ కి వెళ్లి వచ్చే క్రమంలోకాలేజీకి వెళ్తుండగా ట్రైన్ దిగుతుండగా జారి భోగికి ప్లాట్ఫారంకి మధ్యలో పడి నడుము ఫ్యాక్చర్ అయింది అనిఇప్పటివరకు ఏడు లక్షలు వరకు ఖర్చయింది అని 12 లక్షలు వరకు అవుతుందని వైద్యులు చెప్పారని చెప్పారు వీళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవా సంస్థని సహాయం కోరగా సంస్థ నుంచి .10000. కే పావని 1000 . లంకె వెంకటేశ్వర్లు 500 మొత్తం 11500 రూపాయలు భవాని ప్రసాద్ తండ్రి కి ఇవ్వడం జరిగింది అని దీనికి సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదములు తెలియజేశారు



# దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌కు 22 అర్జీలు : కలెక్టర్

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం శనివారం కాకినాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ ప్రజావాణి హాలులో ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్,జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో డాక్టర్ టి.తిప్పేనాయక్, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి ఏవై.శ్రీనివాసు తదితర అధికారులు హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దివ్యాంగుల నుంచి అర్జీలు,దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెన్షన్లు, గృహం, సహాయ పరికరాలు మంజూరు, విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాలు,బహుళ వికలాంగుల సర్టిఫికెట్, ఇతర శాఖాపరమైన విషయాలకు సంబంధించి మొత్తం-22అర్జీలు దివ్యాంగులు పెట్టుకున్నారు. ఈ అర్జీలను




అధికారులు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ప్రతినెల మూడవ శనివారం జిల్లాలో ప్రత్యేక దివ్యంగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నా మన్నారు.విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లాలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా దివ్యాంగులు పెన్షన్లు, సహాయ పరికరాలు మంజూరు,విద్య,ఉపాధి, ఆరోగ్య సేవలు, ఇతర సమస్యలు,సంక్షేమ పథకాలు వంటి అంశాలపై సంబంధించి తమ వినతి పత్రాలను,దరఖాస్తులను నేరుగా జిల్లా అధికారులకు సమర్పించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### విలువలు లేని రాజకీయాలు చేయడం

# చంద్రబాబుకు అలవాటే..

### కూటమి రెండేళ్ల వైఫల్య పాలనపై వైసీపీ సిద్ధం

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ మంత్రి, తూర్పు గోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ అన్నారు. నైతిక విలువలు లేని రాజకీయాలు చేయడంలో సీఎం చంద్రబాబుకు తొలినాటి నుంచి అలవాటేనని వేణు విమర్శించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు నేతృత్వంలో వైసీపీ నేతలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల అనపర్తి నియోజకవర్గం రామవరం గ్రామంలో కూటమి నేతల దాడిలో గాయపడిన నందిక సత్యనారాయణను శనివారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించి వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఇళ్లకు వెళ్లి దాడులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. శుక్రవారం తనతో పాటు అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆసుపత్రికి పరమర్శకు వస్తున్నామని తెలిసి పోలీసులు ద్వారా సత్యనారాయణను కాకినాడ తరలించారని ఆరోపించారు. కాకినాడ ఆస్పత్రిలో నామ మాత్రపు వైద్య సేవలు అందించి ఇంటికి పంపి వేశారన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రెండేళ్ల పాలనపై తాను బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని, ఆయన సవాల్ స్వీకరిస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే సూర్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలో భౌతిక దాడులు ఎక్కువయ్యాయని చెప్పారు. ఎమ్మెల్యే రామకృష్ణ రెడ్డి, ఆయన కుమారుడు మనోజ్ రెడ్డిలు అనపర్తిలో ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నారని అన్నారు. తాము పరామర్శకు వస్తున్నాం అని తెలిసి సత్య నారాయణను పోలీసులు సహాయంతో ఆసుపత్రి నుంచి ఇంటికి బలవంతంగా పంపివేశారని తెలిపారు. నియోజకవర్గంలో పోలీసులను ఉపయోగించి దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. ఇదే విధమైన విధానాలు కొనసాగితే సహించేది లేదని హెచ్చరించారు. తొలుత వేణు, సూర్య నారాయణ రెడ్డిలు పరామర్శకు



వెళ్తున్న సమయంలో అత్యసర విభాగం గేట్లు మూసి ఉండటంతో సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. అదే విధంగా సత్యనారాయణకు అందుతున్న వైద్య సేవలుపై అత్యవసర మెడికల్ విభాగం హెచ్వోడి కె సత్యవాణిను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. అస్తలమాజీ, న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యులు పరీక్షలు నిర్వహించారన్నారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగం వారు అడ్మిషన్ తీసుకుంటారని చెప్పారు. వైద్య పరంగా అన్ని రకాల సేవలు అందించామని, మాత్రలు కూడా ఇచ్చామన్నారు. పెదపూడి వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నార్ల శ్రీనివాస్, యూత్ వింగ్ అధ్యక్షుడు నొక్కి వినోద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ప్రభుత్వాసుపత్రిలో జేసీ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, ఐసీయూ, ఈఆర్ఐసీయూ వార్డులు, ఎక్సరే, ఎంఆర్ఐ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్లలో సౌకర్యాలు, మందుల లభ్యతపై జేసీ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వైద్య సేవలు, సదుపాయాల పట్ల వారి సంతృప్తిని, ఏవైనా ఇబ్బందులు



ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ లావణ్య కుమారి, ఇతర వైద్య అధికారులు, వివిధ విభాగాల అధిపతులతో జేసీ అపూర్వ భరత్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఏమాత్రం రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని స్పష్టం చేశారు. వివిధ వార్డులో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను రోగులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జేసీ అపూర్వ భరత్ వైద్య సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో జేసీ వెంట జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్ శ్రీధర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, వివిధ విభాగాల అధిపతులతో, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

**రావులపాలెం అంటేనే సేవా సంస్థలకు పేరెన్నికగన్నది**

**పేదలు బాగుంటేనే సమాజం బాగుంటుంది**

**రావులపాలెంలో జరిగిన డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నాలుగవ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** తోటి వారికి, పేదవారికి సేవ చేయాలనే సేవాసంస్థల సంకల్పం, ఆలోచన ఎంతో అభినందనీయమని, చాలా గొప్పదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా రావులపాలెం శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన, ఆకుల రామకృష్ణతో కల్సి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం, వస్త్రదానం, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం అంటేనే సేవా సంస్థలకు పేరెన్నికగన్నదన్నారు. అన్నపూర్ణగా ఈ ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు ప్రపంచవ్యాప్తంగా తెచ్చిపెట్టిన మహోన్నతురాలు, నిరతాన్నదాత డొక్కా సీతమ్మ అని కొనియాడారు. 2022లో ఆమె పేరుతో ఈ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించడం,నేడు నాల్గవ వార్షికోత్సవం జరుపుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. నిర్వాహకులు రాజేష్, సభ్యుల సేవలను, వారు చేస్తున్న పలు కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.నేడు రాష్ట్రంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సైతం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అనే పేరునే పెట్టారని గుర్తు చేశారు. పేదల యొక్క ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. అందుకోసం కృషి చేస్తున్న డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారిని ఆయన అభినందించారు.

# ప్రత్యేక లోక్ అదాలత్

**26 బెంచ్‌లు ఏర్పాటు - 1,881 ఎన్.ఐ. యాక్ట్ చెక్ బౌన్స్ కేసులు రాజీమార్గంలో పరిష్కారం**

**ఇంచార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలోని వివిధ న్యాయస్థానాల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్-1881 (ఎన్.ఐ. యాక్ట్)కు సంబంధించిన కేసుల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా 26 ప్రత్యేక లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ ఎల్. వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం 9వ అదనపు జిల్లా జడ్జి జి. షణ్ముఖరావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలోని ఎన్.ఐ. యాక్ట్ కేసులను పరిశీలించి పరిష్కరించారు.అలాగే రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.వి. నాగ రంజీత్ కుమార్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), మెజిస్ట్రేట్ కోర్టుల పరిధిలోని ఎన్.ఐ. యాక్ట్ కేసులను పరిశీలించి పరిష్కరించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మిగిలిన 24 ప్రత్యేక లోక్ అదాలత్ బెంచ్‌లలో కూడా ఆయా కోర్టుల పరిధిలోని నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ చెక్ బౌన్స్ కేసులను పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు.ప్రత్యేక లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్ కేసులతో పాటు ఎన్.ఐ. యాక్ట్ పరిధిలోని మొత్తం 1,881 కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీమార్గంలో పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు.

### తిమ్మాపురం గ్రామ ప్రజలకు

# మాదకద్రవ్యాలపై అవగాహన





**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామంలో గ్రామ ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై జిల్లా ఈగల్ టీం అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఈగల్ టీం సిబ్బంది మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాజులూరు మండల సర్వసభ్య సమావేశం

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు. మండల పరిధిలో గల సమస్యలపై ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తెచ్చారు. ప్రధానంగా గొల్లపాలెం ఆర్డబ్ల్యూఎస్ చెరువులో



త్రాగునీరు కలుషితం కావడం వల్ల మండల గ్రామాల్లో నెలకొన్న త్రాగునీటి సమస్యపై మంజేరు ఎంపీటీసీ మణికంఠ అధికారుల్ని నిలదీశారు. మంజేరు గ్రామంలో నెలకొన్న త్రాగునీటి ఇబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పొలాలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ అంద్రంగి ఎంపీటీసీ తదితరులు అధికారులను ప్రశ్నించారు. హౌసింగ్, ఐకేపీ, ఇరిగేషన్ సమస్యలపై అధికారులు సభ్యులకు వివరణ ఇచ్చారు. కాజులూరు మండలంలో కొత్తగా 6 అంగన్వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు హౌసింగ్ ఏఈ ప్రకటించారు. మండల గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు చెప్పడతామని ఎంపీడీఓ రాంబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాతా భారతి, జడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు వైస్ ఎంపీపీ సలాది వెంకటరమణ, వ్యవసాయశాఖధికారి అశోక్, ఏపీవో వెంకటలక్ష్మి, ఏమ్ఈఓ డేవిడ్, పంచాయితీరాజ్ జేఈ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా

# ఉత్తమ వైద్య సిబ్బందికి సన్మానం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ జనాభా దినోత్సవం-2026 సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్‌లో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ఐఏఎస్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ నియంత్రణ సేవలను ప్రోత్సహించేం దుకు అర్హులైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు ప్రోత్సాహకాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష సేవలందించిన వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, శాలువాలతో సత్కరించారు. ఉత్తమ గైనకాలజిస్టుగా డా. బి.వి.వి.సి.హెచ్. సత్యవాణి, ఉత్తమ వ్యాసెక్టమీ సర్జన్‌గా డా. ఎస్. ఏసేపు సహా పలువురు ఏఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సన్మానం పొందారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్. నైడియా దేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎమ్ లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### వాగ్దేవి స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై

# అక్కడ పరిస్థితి చూడడానికి ఆంధ్ర విద్యార్థి సంఘం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో వడ్డి గూడెం దగ్గర ఉన్న వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై అక్కడ పరిస్థితి చూడడానికి ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా నాయకులు భాను ప్రకాష్ మరియు వారి టీము వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ని సందర్శించారు.భాను ప్రకాష్ మాట్లాడుతూ గాలి వేస్తే పెంకులు ఎగిరిపోతున్నాయని అలాగే పక్కనే డంపింగ్ యార్డ్ ఉందని దానివల్ల పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని రకరకాల ఆరోపణలు రావడంతో వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ని సందర్శించాము అని ఈ స్కూల్ పై వస్తున్న ఆరోపణలు నిజం కాదని ఆయన స్పష్టం చేశారు. అలాగే వాగ్దేవి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 1400 మంది విద్యార్థులు చదువుతున్నారని అక్కడ పచ్చని వాతావరణం ఆడుకోవడానికి గ్రౌండ్ అలాగే పాఠాలు చెప్పే గురువులే పిల్లలకు తల్లిదండ్రుల్లాగా భోజనం తినిపిస్తుంటే ఈ స్కూల్ యొక్క గొప్పతనం కోసం చెప్పక్కర్లేదు. అలాగే బయట వస్తున్న దురుద్దేశపూర్వక ప్రచారం, ఆరోపణలు ఎందుకు చేస్తున్నారో, ప్రతీ సోమవారం స్పందన లో వివిధ స్కూల్స్, కాలేజీ ల మీద కంప్లైంట్ ఇస్తున్న వారిపై నిజనిజాలు మీడియా ద్వారా బయట పెట్టి కఠినంగా వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి అని తెలియజేస్తున్నాము . ఈ కార్యక్రమంలో పవన్ నాయుడు ప్రోగ్రెసివ్ స్టూడెంట్, జిల్లా మెంబర్ ఏ సిద్దు. ఆంధ్ర విద్యార్థి సంఘం మెంబర్ జై గణేష్ పి.చందు పాల్గొన్నారు.

# ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య, పర్యావరణ దినోత్సవం

### డీఆర్వో వి.సుబ్బారావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారాన్ని ప్రత్యేక పారిశుధ్య, పర్యావరణ దినోత్సవంగా నిర్వహిస్తూ, ఒక్కో నెలకు ఒక్కో సామాజిక ఇతివృత్తంతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల కార్యక్రమాన్ని "పర్యావరణ పరిరక్షణ - హరిత ఆంధ్రప్రదేశ్" అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఖాళీ స్థలాలు, రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను సంబంధిత సిబ్బందికి అప్పగించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దుకాణాలు, మార్కెట్లలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి గోనె, జూట్ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. అలాగే వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలు, చెరువులు, కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను కాలుష్య రహితంగా, పచ్చదనంతో నింపడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై స్వచ్ఛ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి నాగలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బరాజు, వికాస్, జిల్లా మేనేజర్ రమేష్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



### తృటిలో తప్పిన ప్రమాదం..

# టిప్పర్ లారీలతో ప్రాణాపాయం

**అధిక లోడుతో వెళుతున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**







**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం ప్రధాన రహదారిపై శనివారం రాత్రి పెను ప్రమాదం తృటిలో తప్పింది. అధిక లోడుతో రాళ్లను తరలిస్తున్న ఓ టిప్పర్ లారీపై నుంచి భారీ రాయి జారిపడి వెనుక బైక్‌పై వెళుతున్న వ్యక్తిపై పడింది. అదృష్టవశాత్తూ ఆ వ్యక్తికి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, లారీపై నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో రాళ్లు లోడ్ చేయడం వల్ల ప్రయాణిస్తున్న సమయంలో రాయి జారిపడింది. ఘటనతో ఒక్కసారిగా రహదారిపై కలకలం రేగింది. బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్ర ప్రమాదం నుంచి బయటపడినప్పటికీ, ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బాధితుడు లారీ డ్రైవర్‌ను ప్రశ్నించగా, "తక్కువ లోడు తీసుకెళ్తే పనికి రావద్దని యజమాని హెచ్చరించాడు. అందుకే అధిక లోడుతో వెళ్లాల్సి వస్తోంది" అని డ్రైవర్ చెప్పినట్లు సమాచారం. గోకవరం ప్రధాన రహదారిపై ప్రతిరోజూ అనేక టిప్పర్ లారీలు అధిక వేగంతో, నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో రాళ్లను తరలిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు ఏ రాయి జారిపడుతుందోనన్న భయంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రాణాలు పోయిన తర్వాత చర్యలు తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, అంతకుముందే రవాణా శాఖ, పోలీసులు, గనుల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అధిక లోడుతో వెళుతున్న లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు వాహనదారులు కోరారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర మనందరి బాధ్యత

**జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి - మొక్కలతోనే వాతావరణ సమతుల్యత**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతామణి పిలుపునిచ్చారు. శనివారం కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శాంతకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి పరిశుభ్రమైన గ్రామాలు, పచ్చని పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అన్నారు. స్వచ్ఛత,పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యతను తెలియజేస్తూ, మొక్కలు నాటారు. ఎంపీడీవో అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను తడి,పొడి వ్యర్థాలుగా వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌కు అందజేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మొక్కల ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "మొక్కలతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించగలం" అన్నారు.పెరుగుతున్న కాలుష్యం, ఉష్ణోగ్రతల పెరుగుదలను తగ్గించడంలో వృక్షాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని, పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సునీత, మండల విద్యాశాఖ అధికారి టి కుశలోవ దొర, సెక్రెటరీ నాగరత్నం, సురేష్ బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### రాయవరం సాయితేజ విద్యార్థికి

# రాష్ట్ర ప్రతిష్ఠాత్మక అవార్డు

**ఎస్ఎస్‌సీలో 591 మార్కులతో ప్రతిభ చాటిన నల్లమిల్లి విశ్వనాథ రెడ్డి**

**రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రం అందుకోనున్న విద్యార్థి**




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు విశ్వనాథ రెడ్డి ఎంపిక కావడం గర్వ కారణమని సాయితేజ విద్యానికేతన్ డైరెక్టర్ కె. సందీప్ రెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం గ్రామంలో గల సాయితేజ విద్యానికేతన్ విద్యార్థి నల్లమిల్లి విశ్వనాథ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డు--2026 కు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ--2026 పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విశ్వనాథ రెడ్డి రాష్ట్ర స్థాయి గుర్తింపును పొందడం పాఠశాలకే కాకుండా రాయవరం మండలానికి గర్వకారణంగా నిలిచిందని సందీప్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు కింద రూ.20,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను సోమవారం రాజమహేంద్రవరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సాయితేజా విద్యానికేతన్ అకాడమిక్ డైరెక్టర్ భాను రేఖ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుధాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థి విశ్వనాథ రెడ్డిని అభినందించారు. ఆయన కృషి, పట్టుదల, క్రమశిక్షణే ఈ విజయానికి కారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.

# 32వ డివిజన్‌లో 25 ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం


**రూ.33 లక్షలతో బాలయోగి స్ట్రీట్.. మసీదు స్ట్రీట్ అభివృద్ధి పనులకు శ్రీకారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 32వ డివిజన్లో గత 25 సం వత్సరాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న బాలయోగి స్ట్రీట్, మసీదు స్ట్రీట్ డ్రైనేజీ, రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సదరు డివిజన్ లో 33 లక్షల వ్యయంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ సీనియర్ నాయకురాలు, డివి జన్ ఇన్‌చార్జ్ ద్వారా సుందరి ప్రతి పాదన మేరకు రూ.33 లక్షలతో అభివృద్ధి పనులు మంజూరయ్యాయని చెప్పారు. ఇందులో బాలయోగి స్ట్రీట్ లో సుమారు 520 మీటర్ల డ్రెయిన్, 120 మీటర్ల సీసీ రోడ్డు, మసీదు స్ట్రీట్‌లో 540 మీటర్ల డ్రెయిన్, 130 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపడు తున్నట్లు వివరించారు. ఈ పనులకు ప్రజలు కూడా సహకరిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఇరుకు వీధుల్లో డ్రెయిన్లపై మెట్లు, ఇతర నిర్మాణాలు ఉండటంతో పారిశుధ్య కార్మికులు డ్రెయిన్లను శుభ్రం చేయలేకపోతున్నారని, అందువల్లే నీరు నిల్వ ఉండి దోమల సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రెయిన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇప్పుడు కొత్తగా నిర్మిస్తున్న డ్రెయిన్లు, రహదారులతో మరో 20-25 సంవత్సరాల పాటు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 32వ డివిజన్లో ఇదొక్కటే కాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న కాలంలో అవసరమైన ప్రతి ప్రాంతంలో డ్రెయిన్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్లుగా పద్మజ, కృపానిధి ఎంపిక





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలు బి.పద్మజారాణి, వై.కృపానిది ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి గుర్తింపు తెచ్చారని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.కృష్ణ కిషోర్ కొనియాడారు. శనివారం ప్రిన్సిపల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ పద్మజారాణి, కృపానిది ప్రతిభను గుర్తించిన రాష్ట్ర విద్యాశాఖ షై నింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ కృష్ణ కిషోర్ తెలిపారు.ఈ అవార్డుకు నగదు పుష్కారం 20వేల, ప్రశంస పత్రం, మెడల్స్‌తో ఈనెల 20వ తేదీన రాజమహేంద్రవరంలో జిల్లా ఇన్చార్జి మంత్రి,జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.

# దూగర, నల్ల బూడిద బయటకు రాకుండా చర్యలు తీసుకోండి

**రైసుమిల్లు యజమానులకు కమిషనర్ హెచ్చరిక**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో ఉన్న రైసుమిల్లు యజమానులు ఆయా మిల్లుల నుంచి వెలువడే నల్ల బూడిద, దూగర బయటకు రాకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. కాలుష్య నియంత్రణ చర్యలకు కమిషనర్ రంగారావు శనివారం రైసుమిల్లులు, ఇతర పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో ఉన్న లోపాలను వెంటనే సరిదిద్దాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైస్ మిల్లులు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న బూడిద రేణువులు పట్టణంలోకి వ్యాపించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అక్కడ పనిచేసే కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరచి తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏడిద రోడ్డులోని కొన్ని రైస్ మిల్లుల వద్ద పాడి ఆవులు, గేదెలను కట్టి అపరిశుభ్ర వాతావరణం సృష్టిస్తున్నట్లు గుర్తించామని, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి, పురపాలక ప్రజారోగ్య శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో రైస్ మిల్లుల యజమానులు మాట్లాడుతూ రైస్ మిల్లులతో పాటు పట్టణంలోని కొన్ని హోటళ్లు, స్వీట్ షాపుల నుంచి కూడా బూడిద వెలువడుతోందని, వాటిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్, హోటళ్లు, స్వీట్ షాపుల యజమానులతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించి, నోటీసులు జారీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో టీపీవో కే రమ్య, ఏఈలు పవన్ కుమార్, ఆర్ అనుష లక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ సెంటర్‌ను

# తనిఖీ చేసిన ఐసిడిఎస్ అధికారులు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం అంగన్వా డీ -వన్ సెంటర్‌ను కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారులు పిఓటీ. శ్రీదేవి, సి.డిపి.ఓ. డి.సంధ్యారాణి తనిఖీ చేయడం జరిగింది. పిల్లలకు పౌష్టికాహారం, విద్యా బోధన తదితర అంశాలపై అంగన్వాడిలో చర్చించడం జరిగింది. ఈ సందర్భముగా అధికారులు మాట్లాడుతూ చుట్టుప్రక్కల పరిశుభ్రత పాటించాలని పిల్లలు ఆరోగ్యంగా ఉండా లంటే పిల్లలకు మంచి పౌష్టి కాహారం అందించాలని అ న్నారు. పిఓ శ్రీదేవి, సిడిపిఓ సంధ్యారాణి పిల్లలతో పాటలు పాడించారు. మరియు అంకెలు చెప్పించారు, సెంటర్లో ఉన్న ఆట వస్తువులు,బొమ్మలు అట్టలతో, కొబ్బరి చిప్పలు, కొబ్బరి పీచులతో తయారుచేసిన ఆట వస్తువులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడీ పిల్లలకు పుల్లా సుందర్ సింగ్ కొంత వ్యయం ఖర్చుపెట్టి సుందర్ సింగ్ చెల్లి గెడ్డం ఉష చేతులు మీదుగా మరియు ఐసిడిఎస్ అధికారుల సమక్షంలో పిల్లలకు బ్యాగులు,నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు, పిల్లలందరికీ యూనిఫామ్ కూడా ఇవ్వ డం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసి డిఎస్ పిఓ. టీ.శ్రీదేవి, సిడిపిఓ, డి.సంధ్యారాణి, సూపర్వైజర్ అచ్చయమ్మ, బి.కుమారి, టి.కనకరత్నం, జి.ఉష, అంగన్వాడీ టీచర్స్ రామ లక్ష్మి, పద్మావతి, హెల్పర్, ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య సంరక్షణలో

# అంగన్‌వాడీల పాత్ర కీలకం

**అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు యూనిఫాం చీరల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని, సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కొనియాడారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 242 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రెండు జతల చొప్పున చీరలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పూర్ణిమ, ఎంఈవో నాయుడు రామచంద్రరావు, డిప్యూటి ఎంపీడీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్ వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీఎమ్ అండ్ హెచ్‌ఓ డాక్టర్ పితాని కోమలను మర్యాదపూర్వకంగా కలిసిన పీఎంపీలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా నియ మితులైన డాక్టర్ పితాని కోమలను కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవై డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) సభ్యులు శనివారం బొమ్మూరు కలెక్టర్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ కోమల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పీఎంపీలు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలని సూచించారు.అలాగే సీజనల్ వ్యాధుల పట్ల,కోవిడ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రథమచికిత్స మాత్రమే అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, రాజమండ్రి శాఖ అధ్యక్షులు రహమాన్ ఖాన్,కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి కోల లక్ష్మీనారాయణ, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సీహెచ్ఎన్ఎస్బీ కామరాజు తదితరులు పాల్గొన్నారు.




# 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన.. విజేతలు వీరే..!





భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత ప్రమాణాలను, అసాధారణ ప్రతిభను గౌరవిస్తూ ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారాలు "జాతీయ చలనచిత్ర అవార్డులు". ఈ ఏడాది ఎంతో ఉత్కంఠ నడుమ కేంద్ర సమాచార, ప్రసార శాఖ 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను అధికారికంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో రూపొంది, ప్రేక్షకులను అలరించడమే కాకుండా సినిమాటిక్ విలువలను పెంచిన ఉత్తమ చిత్రాలు, నటీనటులు మరియు సాంకేతిక నిపుణులను ఈ పురస్కారాలు వరించాయి.

**72వ జాతీయ చలనచిత్ర అవార్డుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి..**

ఉత్తమ తెలుగు చిత్రం – కమిటీ కుర్రోళ్లు, ఉత్తమ మేకప్ – పి.రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు), బెస్ట్ డైలాగ్ రైటర్ – వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ (ఒరిజనల్) – సుకుమార్ (పుష్ప–2), బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ – దీపాలి నూర్, శీతల్ శర్మ (పుష్ప–2), ఉత్తమ బాలల చిత్రం – 35 చిన్న కథ కాదు, ఉత్తమ పాపులర్ చిత్రం – కల్కి 2798 ఏడీ, ఉత్తమ చిత్రం – ఆర్టికల్ 370, ఉత్తమ నటుడు – మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్ (సంయుక్తంగా), ఉత్తమ నటి – యామీ గౌతమ్ (ఆర్టికల్ 370), ఉత్తమ దర్శకుడు – రాజ్‌కుమార్ పెరియస్వామి (అమరన్), ఉత్తమ నేపథ్య గాయని – వైకోం విజయలక్ష్మి (ఏఆర్ఎం), ఉత్తమ నేపథ్య గాయకుడు – అభయ్ జోధ్ పుర్కర్, బెస్ట్ సినిమాటోగ్రఫర్ – జలాల్ (భ్రమయుగం), ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రం – కెప్టెన్ మిల్లర్ (తమిళం), బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ – నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2798 ఏడీ), బెస్ట్ ఎడిటర్ – కలైవన్నన్ (అమరన్), బెస్ట్ సౌండ్ డిజైనర్ – మానస్ చౌదరి (భూల్ బులియా), బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ – యోగేశ్ దేశ్‌పాండే, ఉత్తమ పాటల రచయిత – మనోజ్ ముంతాసిర్ (మైదాన్), ఉత్తమ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ – జీవీ ప్రకాశ్ కుమార్ (అమరన్), ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు) – శశ్వంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370), ఉత్తమ తమిళ చిత్రం – రాయన్, ఉత్తమ మలయాళ చిత్రం – ఫెమినిస్ట్ ఫాతిమా, ఉత్తమ కన్నడ చిత్రం – మిథ్య (ఇల్యూజన్), ఉత్తమ హిందీ చిత్రం – శ్రీకాంత్, ఉత్తమ గుజరాత్ చిత్రం – మారన్ (ద హంట్), ఉత్తమ బెంగాలీ చిత్రం – చల్‌చిత్ర ఎఖో, బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ – సంజీవ్ శ్రీవాస్తవ (హిందీ), సినిమాలపై ఉత్తమ పుస్తక రచయిత – ప్రదీప్‌కుమార్ శెట్టి (కన్నడ), నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ – ద చోలా డోరా ఔర్ సూయి, నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: స్పెషల్ మెన్షన్ – భద్రకాళి నాటకం, నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ స్క్రిప్ట్ – ఓబుర్, నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ సినిమాటోగ్రఫీ – లైవ్ ఇన్ లూమ్, నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డైరెక్షన్ – ఆనంద్ రాయ్ (స్టాట్యూ ఆఫ్ యూనిటీ), నాన్‌ఫీచర్ ఫిల్మ్ క్యాటగిరీ: బెస్ట్ డాక్యుమెంటరీ – రామ్ నమీ, స్పెషల్ మెన్షన్ – మేయళగన్ (తమిళం), స్పెషల్ మెన్షన్ – తమిళ చిత్రం కెప్టెన్ మిల్లర్ (ధనుష్).

### సర్ ప్రైజ్ ఇచ్చిన వారణాసి మేకర్స్..

# అదిరిపోయిన ప్రియాంక లుక్స్ రిలీజ్..



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం వారణాసి. డైరెక్టర్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుంది. మొదటి నుంచి ఈ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన మహేష్ బాబు ప్రీ లుక్స్, గ్లింప్స్ మంచి హైప్ క్రియేట్ చేశాయి. తాజాగా సూపర్ స్టార్ అభిమానులకు స్వీట్ సర్ ప్రైజ్ ఇచ్చారు మేకర్స్. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ చిత్రం వారణాసి. సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రధాన పాత్రలో డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో మహేష్ బాబు జోడిగా బాలీవుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుంది. అలాగే మలయాళీ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇదివరకు విడుదలైన మహేష్ ప్రీ లుక్ పోస్టర్స్, గ్లింప్స్ సినిమాపై ఓ రేంజ్ హైప్ క్రియేట్ చేసాయి. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఇందులో ప్రియాంక మందాకిని పాత్రలో నటిస్తున్నారు. ఈరోజు (జూలై 18న ) ఆమె పుట్టినరోజు కావడంతో సెట్ లోని ఫోటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ చేశారు. "ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక.." అనే క్యాప్షన్ ఇస్తూ షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు వైరలవుతున్నాయి. అటు మహేష్ సైతం ప్రియాంకకు విషెస్ చెప్పారు. "మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్ డే " అంటూ రాసుకొచ్చారు. మహేష్ బాబు సరసన ప్రియాంక మొదటిసారి నటిస్తున్నారు. ఈ మూవీ కోసం ఆమె దాదాపు 14 నెలల నుంచి షూటింగ్ లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. అలాగే ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేష్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతోపాటు కాలాల్ని చుట్టేసే సాహిసికుడి కథగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు జక్కన్న. బాహుబలి, ఆర్ఆర్ఆర్ తర్వాత వరల్డ్ వైడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి సరికొత్త సంచలనం సృష్టించేందుకు రెడీ అయ్యారు రాజమౌళి.

**ప్రియాంక విషయానికి వస్తే..**

ప్రియాంక చోప్రా.. ఇప్పుడు గ్లోబల్ స్టార్. హిందీలో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన ఆమె.. 2000లో ప్రపంచసుందరిగా కిరీటాన్ని అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సొంతం చేసుకున్నారు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే.. 2018 డిసెంబర్ లో అమెరికన్ సింగర్, నటుడు నిక్ జోనాస్ ను వివాహం చేసుకున్నారు ప్రియాంక. వీరికి సరోగసి ద్వారా మాల్తీ మేరీ చోప్రా అనే అమ్మాయి జన్మించింది.

# చెన్నై లవ్ స్టోరీ ట్రైలర్ టాక్

### అందమైన విజువల్స్, హార్ట్ టచింగ్ ఎమోషన్స్..!




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, అందాల భామ శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తున్న లేటెస్ట్ ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ సినిమాపై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి క్రేజ్ ఉండగా, తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అవుట్ అండ్ అవుట్ ప్యూర్, ఇంటెన్స్ ఎమోషనల్ లవ్ స్టోరీగా కట్ చేసిన ఈ ట్రైలర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి బాక్సాఫీస్ వద్ద గట్టి రొమాంటిక్ హిట్ కొట్టబోతున్నాడని స్పష్టమవుతోంది. ట్రైలర్ విషయానికొస్తే.. చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక అందమైన ప్రేమకథను ఇందులో చూపించారు. ఇద్దరు భిన్నమైన మనస్తత్వాలు కలిగిన యువతీ యువకుల మధ్య చిగురించిన పరిచయం, ఆపై ప్రేమ.. ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన ఊహించని మలుపులు, ఎమోషన్స్ చుట్టూ కథను చాలా నేచురల్‌గా నడిపినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం తన లుక్స్ అండ్ డైలాగ్ డెలివరీతో మెప్పించగా, హీరోయిన్‌తో అతని కెమిస్ట్రీ, ఎమోషనల్ సీన్స్ ట్రైలర్‌లో మేజర్ హైలైట్‌గా నిలిచాయి. ఇక సాయి రాజేష్, ఎస్.కె.ఎన్ మార్క్ మేకింగ్ వాల్యూస్ ప్రతి ఫ్రేమ్‌లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవల తిరుపతిలో విడుదలైన 'జిగితార' సాంగ్ లాగే, ట్రైలర్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరియు సినిమాటోగ్రఫీ విజువల్స్ ప్రేక్షకులను కథలోకి తీసుకువెళ్లేలా ఉన్నాయి. జూలై 24న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా బాక్సాఫిస్ దగ్గర ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# స్పెయిన్ 'డిఫెన్స్'.. అర్జెంటీనాకు పెద్ద సవాల్




లియోనెల్ మెస్సి.. అర్జెంటీనా.. ఇదీ ప్రపంచ కప్ ఫైనల్ వేళ ప్రతి ఒక్కరి నోటా వినిపిస్తోన్న మాట. కానీ, అక్కడ ప్రత్యర్థి స్పెయిన్ అని మరిచిపోవద్దు. తక్కువగా అంచనా వేయడానికి వీల్లేని కఠినమైన జట్టే. పెను సంచలనం లామినె యమాల్‌ను మాత్రమే అడ్డుకుంటే గెలిచేస్తామని అర్జెంటీనా భావిస్తే మాత్రం 'తప్పు'లో కాలువేసినట్లే. మైదానంలోకి దిగే ప్రతి ప్లేయరూ ఆ జట్టుకు కీలకాస్త్రమే. మిడ్‌ఫీల్డర్ల నుంచి డిఫెండర్ల వరకూ పట్టు బిగిస్తారంతే.

**కలిసి కట్టుగా..**

ఫుట్‌బాల్ ప్రపంచ కప్‌లో ఇప్పటి వరకు స్పెయిన్ కేవలం రెండు సార్లు మాత్రమే ఫైనల్‌కు వెళ్లింది. అందులో ఒకసారి ఛాంపియన్ (2010)గా నిలిచింది. ఇప్పుడు రెండోమారు కప్పు కోసం తలపడేందుకు సిద్ధమైంది. ఇతర పెద్ద జట్ల మాదిరిగా స్పెయిన్‌కు ఫలానా ప్లేయర్ టాప్ అని చెప్పడానికి లేదు. ఫుట్‌బాల్ అంటేనే సమష్టిగా ఆడే గేమ్. అందుకు సరైన ఉదాహరణ స్పెయిన్ అనడంలో సందేహం లేదు. ఇప్పుడంటే లామినె యమాల్ పేరు ఎక్కువగా వినిపిస్తుంది కానీ.. ఆ జట్టులో మరికొందరు మంచి ప్లేయర్లు ఉన్నారు. మరీ ముఖ్యంగా ఆ జట్టు డిఫెండింగ్‌ను ఛేదించి గోల్ కొట్టాలంటే ప్రత్యర్థులకు సవాలు తప్పదు. అర్జెంటీనా డిఫెన్స్‌తో పోలిస్తే స్పెయిన్ ఈ విషయంలో అభేద్యమైనది.

**పరుగు మొదలుపెడితే..**

మెస్సి చుట్టూ అర్జెంటీనా.. ఎంబాపె చుట్టూ ఫ్రాన్స్.. రొనాల్డోపై పోర్చుగల్ ఆధారపడినట్లు స్పెయిన్ మ్యాచ్ బరిలోకి దిగదు. జట్టులోని ప్రతి ఒక్కరూ స్టారే. ఎవరు ఏ పాత్ర పోషించాలనేది ముందే డిసైడ్ అయిపోతుంది. అందుకు తగినట్టుగా వ్యవహరించడమే వారి పని. మైదానంలోకి దిగిన తర్వాత పరుగు ఎక్కడా ఆగదు. అవసరమైతే ఈ చివర నుంచి ప్రత్యర్థి గోల్ కీపర్ వరకూ వెళ్తారు. అలా చేస్తే ఒత్తిడి పెరిగి అవతలి జట్టు పొరపాట్లు చేస్తుందనేది వారి ప్రణాళిక. లామినె యమాల్ బంతిని పాస్ చేయడంతోపాటు గోల్ పోస్ట్ వైపు తీసుకెళ్లడంలో నేర్పరి.

**తొలి నుంచి ఒకటే విధానం..**

ప్రపంచ కప్ 2026లో స్పెయిన్ ఆడిన తొలి మ్యాచ్ డ్రా అయింది. అదీనూ ఇప్పటి వరకు పెద్దగా తెలియని కేప్ వెర్దెతో కావడం గమనార్హం. అలాగని స్పెయిన్ కంగారు పడిపోలేదు. పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకుంది. కానీ.. తన దూకుడైన ఆటతీరును మాత్రం మార్చుకోలేదు. నాకౌట్‌లో పోర్చుగల్, బెల్జియంపై అద్భుత విజయాలు సాధించింది. ఇక సెమీస్‌లో బలమైన ఫ్రాన్స్‌ను చిత్తు చేసింది. స్పెయిన్ డిఫెండర్లు ఎంత స్ట్రాంగ్‌గా ఉంటారంటే.. ప్రత్యర్థి ఆటగాళ్లు గోల్ పోస్టు వైపు రావాలంటే తీవ్రంగా శ్రమించాల్సిందే. ఫిఫా ప్రపంచ కప్ గణాంకాలే అందుకు సాక్ష్యం. ఈ అభేద్యమైన డిఫెన్స్‌ను తట్టుకొని కేవలం ఒక్క గోల్‌ను మాత్రమే ప్రత్యర్థులు కొట్టడం గమనార్హం.

**కీలక ప్లేయర్లు:** గావి (మిడ్ ఫీల్డర్లు), మైకెల్ మెరినో (మిడ్‌ఫీల్డర్), డాని ఓల్మో (ఫార్వార్డ్), నికో విలియమ్స్ (ఫార్వార్డ్), లామినె యమాల్ (ఫార్వార్డ్), మునోజ్ (ఫార్వార్డ్), కుకురెల్లా (డిఫెండర్), పెడ్రో పొర్రో (డిఫెండర్), జోవాన్ గార్సియా (గోల్ కీపర్).

# యమాల్ మాత్రమే కాదు.. ఈ ముగ్గురూ మెస్సి ఆడించిన వారే

ఫిఫా ప్రపంచ కప్‌లో ప్రస్తుతం అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సికి విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. ప్రత్యర్థి స్పెయిన్ జట్టులో స్టార్ ఆటగాడు లామినె యమాల్‌కు చిన్నప్పుడు మెస్సి స్నానం చేయించిన ఫొటోలు వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. అయితే, యమాల్ మాత్రమే కాకుండా.. మరో ముగ్గురు స్పెయిన్ ఆటగాళ్లు కూడా మెస్సితో చిన్నతనంలో ఆడి ఫొటో దిగడం గమనార్హం. మెస్సి బార్సిలోనా క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అప్పుడప్పుడు అక్కడి చిన్నారులతో సరదాగా ఆడేవాడు. ఇప్పుడు వారితోనే ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్‌లో తలపడనుండటం ఆసక్తికరంగా మారింది.

**గావి:** 21 ఏళ్ల స్పెయిన్ యువ ఆటగాడు గావి పిల్లాడిగా ఉన్నప్పుడు మెస్సితో ఫొటో దిగాడు. ఇతడు కూడా మెస్సి ప్రాతినిధ్యం వహించిన బార్సిలోనా క్లబ్ తరఫున ఆడాడు. మిడ్‌ఫీల్డర్‌గా మంచి ప్రతిభ కనబరిచాడు. మెస్సి ఆడిన లా మాసియా అకాడమీ నుంచే గావి వచ్చాడు.

**డాని ఓల్మో:** 28 ఏళ్ల డాని ఓల్మో కూడా మెస్సి ఆడిన బార్సిలోనాలో సభ్యుడే. మెస్సినే ఇతడికి రోల్ మోడల్. 17 ఏళ్ల కిందట మెస్సితో కలిసి ఓల్మో ఫొటో దిగాడు. ఎటాకింగ్ ప్లేయర్ అయిన ఇతడిని.. మెస్సి సారథ్యంలో అర్జెంటీనా ఎలా అడ్డుకుంటుందో చూడాలి.




**జోవాన్ గార్సియా:** మెస్సితో చిన్నప్పుడే ఫొటో దిగిన ఈ పాతికేళ్ల జోవాన్ గార్సియా స్పెయిన్ బెస్ట్ గోల్ కీపర్. అంతర్జాతీయంగా 30 మ్యాచులు ఆడిన అతడు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ప్రత్యర్థి ఆటగాళ్లు తమ గోల్ పోస్టు వైపు కొట్టే బంతిని అడ్డుకోవడంలో సమర్థుడు.




# అందరూ వీడ్కోలు పలకాల్సిందే కదా

### రోహిత్ రిటైర్మెంట్‌పై కపిల్ దేవ్



లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో ఆదివారం జరగనున్న మూడో వన్డే రోహిత్ శర్మకు చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావొచ్చని వార్తలొస్తున్నాయి. ఈ ప్రచారంపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించారు. రోహిత్ ఎప్పుడు రిటైరైనా అభిమానులు బాధపడవద్దని, అతడికి ఘనంగా వీడ్కోలు పలకాలని కపిల్ దేవ్ సూచించారు. ఇన్నేళ్లుగా రోహిత్ తన అద్భుతమైన ఆటతీరుతో క్రికెట్ అభిమానులను ఎంతగానో అలరించాడని పేర్కొన్నారు. "ఈ విషయంలో మనం ఎందుకు బాధపడాలి? సంతోషంగా ఉందాం. ఇన్నేళ్లుగా రోహిత్ మనల్ని ఎంతగానో అలరించాడు. ప్రతిఒక్కరూ రిటైర్ కావాల్సిందే. సునీల్ గావస్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, సచిన్ ఇలా చాలామంది స్టార్ ఆటగాళ్లు రిటైర్ అయ్యారు. రోహిత్ తన ఆటతీరుతో కేవలం దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. అతను రిటైరైతే బాధపడకుండా సంతోషంగా వీడ్కోలు పలకాలి. రోహిత్ ఏదో ఒక రోజు రిటైర్ కావాల్సిందే. అతను వీడ్కోలు పలికితే ఆ మ్యాచ్‌లో సెంచరీ చేసి అంతర్జాతీయ కెరీర్‌ను ముగించాలని ఆశిస్తున్నాను" అని కపిల్ దేవ్ అన్నారు. 39 ఏళ్ల రోహిత్ ఇప్పటికే అంతర్జాతీయ టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వన్డేలు మాత్రమే ఆడుతున్న అతను కొంతకాలంగా భారీ స్కోర్లు చేయడం లేదు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 11, 26 పరుగులు చేశాడు. ఈ ఏడాది ఎనిమిది మ్యాచ్‌ల్లో 30.12 సగటుతో 241 పరుగులే సాధించాడు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com